ప్రజాశక్తి
గురువారం 08 ఆగస్టు 2024 5 కర్నూలు





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కార్యాచరణ ప్రణాళికలు రూపొందించండి

- కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ప్రతి శాఖ వందరోజులు, ఏడాది, ఐదేళ్ల కాలానికి లక్ష్యాలతో కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో వంద రోజుల ప్రణాళిక, ఏడాది ప్రణాళిక, 5 ఏళ్ల కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనపై జిల్లా అధికారులతో కలెక్టర్ పి.రంజిత్ బాషా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇరిగేషన్ శాఖకు సంబంధించిన ప్రాజెక్టులకు మరమ్మతులు, రిజర్వాయర్లను, మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు నింపడం, ఆయకట్టుకు నీరు ఇవ్వడం తదితర అంశాలను ప్రణాళికల్లో చేర్చాలని సూచించారు. పరిశ్రమలకు సంబంధించి ఓర్వకల్లు ఇండస్ట్రీయల్ కారిడార్ అభివృద్ధి, సింగిల్ విండో అనుమతులు, పిపిపి బేస్డ్ ప్రాజెక్టులు ఎక్కడ చేయవచ్చు అనే అంశాల మీద పరిశ్రమల శాఖ, ఎపిఐఐసి సమన్వయంతో యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. హౌసింగ్‌కు సంబంధించి నాట్ స్టార్టెడ్ ఇళ్ల నిర్మాణాలు మొదలు పెట్టే విధంగా, ముఖ్యంగా రూఫ్ కాస్ట్‌లో ఉన్న ఇళ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించి పూర్తి చేసే దిశగా లక్ష్యాలు నిర్ణయించుకోవాలని తెలిపారు. వ్యవసాయానికి సంబంధించి ఈ-క్రాప్ బుకింగ్, సిఆర్‌సి కార్డులు, పొలం బడి, రుణాల మంజూరు తదితర అంశాలపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. హార్టికల్చర్‌కు సంబంధించి ఎక్స్‌పోర్ట్ చేసే పండ్లను ఇక్కడ పండించే విధంగా చర్యలు తీసుకోవడంతో రైతులకు ఎంతో లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ఒక రైతును చూసి ఇంకో రైతు కూడా అదే పంటను వేసి లాభాలను పొందుతారని హార్టికల్చర్ అధికారికి సూచించారు. జిల్లాలో పండించే ఉత్పత్తులను రైతులకు లాభం కలిగే విధంగా నేరుగా మార్కెటింగ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని లక్ష్యాలు నిర్దేశించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా రాయితీపై ప్రభుత్వ కార్యాలయాలన్నింటిపై సోలార్ ప్లాంట్ల ఏర్పాటు, వేలాడే విద్యుత్ తీగల తొలగింపు తదితర అంశాలను లక్ష్యాలుగా నిర్ణయించుకోవాలని తెలిపారు. 250 నుంచి 500 మంది ఉన్న జనాభా ఉండే 10 గ్రామ పంచాయతీల్లో 5 ఎకరాల్లో ప్రభుత్వ భూమిలో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే పది సిపిడబ్ల్యుఎస్ స్కీములకు కూడా సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని తెలిపారు. సోలార్ ఏర్పాటు ద్వారా ప్రజలకు ఉచితంగా విద్యుత్ ఇచ్చేందుకు వీలవుతుందన్నారు. పంచాయతీల మీద విద్యుత్‌కు సంబంధించిన అధిక బిల్లులు వచ్చే అవకాశం ఉండదని తెలిపారు. గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో 100 శాతం సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని డిఇఒను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి విద్యా వాలంటీర్లను నియమించేందుకు గైడ్‌లెన్స్ రాగానే వారిని నియామకం చేయాలని తెలిపారు. పాఠశాలల్లో 10వ తరగతి పూర్తయిన విద్యార్థులు వెంటనే ఇంటర్మీడియట్‌లో చేరారా? లేదా? అని సంబంధిత విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి వారు ఇంటర్మీడియట్ ఎక్కడ జాయిన్ అయ్యారనే వివరాలను తెలుసుకొని యాప్‌లో అప్‌డేట్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజనంలో విద్యార్థుల హాజరు తక్కువగా ఉందని, పురోగతి సాధించే దిశగా చర్యలు తీసుకోవాలని డిఇఒను ఆదేశించారు. స్కిల్ డెవలప్‌మెంట్, ఉపాధి కల్పన, యూత్ విభాగం శాఖలు ఉద్యోగ వివరాలను నిరుద్యోగ యువతకు తెలిసేలా ఒక పోర్టల్ డిజైన్ చేయాలని సూచించారు. జిల్లాలో గంజాయిలాంటి మత్తు పదార్థాలు వాడకుండా కళాశాలలు, పాఠశాలలు, హాస్టల్ సముదాయాల్లో ఉండే షాపులను తనిఖీ చేయాలని సెబ్ అధికారులను ఆదేశించారు. ఉచిత ఇసుక విధానంలో భాగంగా కొత్త ఇసుక రీచ్‌ల గుర్తింపు, ఇసుక అక్రమ రవాణాను అరికట్టడం తదితర అంశాలను ప్రణాళికలో పొందుపరచాలని తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్‌కి సంబంధించి తాగునీటి సమస్యలు రాకుండా పటిష్టమైన చర్యలు తీసుకునే విధంగా లక్ష్యాలు నిర్ణయించుకోవాలన్నారు. ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, డిఆర్‌ఒ మధుసూదన్ రావు పాల్గొన్నారు.

సాగని అమృత్...

- పురపాలికల్లో పారని నీరు - తప్పని నీటి కష్టాలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఇంటింటికీ తాగునీటి కుళాయి పేరుతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అమృత్ రెండో దఫా పనులు పూర్తికాకపోవడంతో ఎంపిక చేసిన పురపాలికల్లో నీరు పారడం లేదు. దీంతో ఆయా పురపాలికల వాసులకు నీటి కష్టాలు తప్పడంల లేదు...

పురపాలికల్లో ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకం కింది ఉమ్మడి కర్నూలు జిల్లాలోని కర్నూలు నగరపాలక సంస్థ, ఆదోని మున్సిపాలిటీ, నంద్యాల మున్సిపాలిటీలను ఎంపిక చేశారు. వాటిల్లో రెండో దఫా అమృత్ పథకం పనులు ముందుకు సాగడం లేదు. ఈ పనుల కోసం 2023 జనవరిలో ఒక సారి, మే నెలలో మరో సారి కేంద్రం పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. డిపిఆర్ తయారు చేయించి, సాంకేతిక అంశాలు దాటించి, టెండర్ కోసం ఏర్పాట్లు చేయడంలో అధికారులు విఫలం అయ్యారు. దీంతో ఆయా పురపాలికల్లో పట్టణ వాసులకు నీటి కష్టాలు తప్పడం లేదు. పెరిగిన జనాభాకు అనుగుణంగా కర్నూలు నగరంలో రోజుకు 180 ఎంఎల్‌డి నీరు అందించాలి. ప్రస్తుతం 35 ఎంఎల్‌డికి మించి నీటిని సరఫరా చేయడం లేదు. పథకాల నిర్వహణలో సమస్యలు, నగరంలో విలీన గ్రామాలతో జనాభా పెరగడం, తదితర కారణాలతో నీటి కష్టాలు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో రూ.115 కోట్లతో అమృత్ కింద పనులు చేపట్టాలని ప్రణాళిక రూపొందించారు. జగనాథ గట్టు ప్రాంతంలో నీటి శుద్ధి కర్మాగారం, నగరంలో 22 ఉపరితల నీటి ట్యాంకులు, పైప్ లైన్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. వాటికి అడుగులు ముందుకు పడలేదు.

अमृत 2.0
Atal Mission for Rejuvenation and Urban Transformation

ఆదోని పట్టణంలో ప్రస్తుతం సగం వార్డులకు రెండు రోజులకోసారి, మిగిలిన వార్డులకు మూడు నాలుగురోజులకోసారి నీటిని అందిస్తున్నారు. రోజూ 25 ఎంఎల్‌డి నీటిని ఇవ్వాల్సి ఉండగా 22 ఎంఎల్‌డి నీటిని ఇస్తున్నారు. లీకేజీల కారణంగా మరో పది శాతం నీరు వృథా అవుతోంది. సీజన్‌తో నిమిత్తం లేకుండా నీటి సమస్యలతో ఆదోని పట్టణ వాసులు సతమతమవుతున్నారు. ప్రధానంగా శివారు కాలనీల విస్తీర్ణం పెరుగుతోంది. అందుకు తగ్గట్లు నీటిని అందించలేకపోతున్నారు. అమృత్ కింద రూ.35.17 కోట్లతో ప్రణాళిక రచించారు. ఇందులో రూ.12.90 కోట్లుతో శివారు ప్రాంతాల్లో నీటి అవసరాలు తీర్చేందుకు, రూ.22.27 కోట్లు నీటి వనరులు పెంచుకోవాలనుకున్నారు. ఆ పనులకు అడుగులు ముందుకు పడలేదు. అమృత్ పథకం కింద నంద్యాల మున్సిపాలిటీలో రూ.174 కోట్లతో ఐదు పనులు చేపట్టాలనుకున్నారు. నగరంలో 42 వార్డులు ఉన్నాయి. రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేస్తున్నారు. రోజు 26 నుంచి 28 ఎంఎల్‌డి నీటిని అందించాలి. 24 ఎంఎల్‌డికి మించడం లేదు. గతంలో చేపట్టిన అమృత్ పనులు కొంత మిగిలి ఉండటం ఒకింత సమస్యగా మారింది. ప్రస్తుతం వెలుగోడు నుంచి నీరు తీసుకుంటున్నారు. గోరుకల్లు నీటి నుంచి అవసరాలు తీర్చాలనే దిశగా యోచిస్తున్నారు. అమృత్ రెండో దఫా పనులు పూర్తయితే భవిష్యత్తు 40 ఏళ్ల వరకు నీటి సమస్యలు రావనేది అధికారులు అంచనా వేశారు. అమృత్ పనులు పూర్తికాకపోవడంతో ఆ ఆశయం నెరవేరడం లేదు.

రైతులు పొలాలకు వెళ్లేందుకు

వీలుగా రోడ్డు వేయాలి

- కలెక్టర్‌కు సిపిఎం వినతి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూలు మండలం గార్గేయపురం దగ్గర దాదాపు మూడు కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్డు బ్రిడ్జి నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో రైతులు పొలాలకు వెళ్లేందుకు వీలుగా రోడ్డు వేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కెవి.నారాయణ కలెక్టర్‌ను కోరారు. బుధవారం కలెక్టర్ పి.రంజిత్ బాషాను సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కెవి.నారాయణ, కర్నూలు, మండల కార్యదర్శి పిబి.హుస్సేనయ్య, మండల నాయకులు మృత్యుంజయ, గ్రామ రైతులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడారు. కర్నూలు నుంచి గుంటూరుకు జాతీయ రహదారి పనులు జరుగుతున్నాయన్నారు. గార్గేయపురం దగ్గర దాదాపు మూడు కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్డు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఈ కారణంగా రైతులు పొలాలకు వెళ్లాలంటే బ్రిడ్జి పైనుంచి కిందికి దిగడం చాలా ఇబ్బందికరంగా ఉంటుందని చెప్పారు. అలాగే వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయని, ముఖ్యంగా పొగాకు పంటలు ఎక్కువగా వేసే రైతులు ఉన్నందు వల్ల వాళ్లు పొలాల్లో నారలు తీసుకొని నాట్లు వేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. పొలాలకు దారి లేకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. రహదారి పనులు ఏర్పాటు చేసే వారు సర్వీసు రోడ్లు వేయాలని, బాధ్యత లేకుండా రోడ్డు నిర్మాణం పనులు చేపడుతున్నారని తెలిపారు. సర్వీసు రోడ్లు ఏర్పాటు చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. కలెక్టర్ స్పందిస్తూ... తక్షణమే రైతులకు ఇబ్బంది లేకుండా రోడ్డుకు ఇరువైపులా సర్వీస్ రోడ్లను ఏర్పాటు చేయించి, రైతుల పంటలకు ఇబ్బంది లేకుండా వారి పొలాలకు దారిని ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. గ్రామ రైతులు రవికుమార్, నరసింహులు, వెంకటేశ్వర్లు, కృష్ణుడు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చిన్న పనులపై శ్రద్ధ చూపాలి

- పిపిఎస్ఎస్ నాయకులు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

రూ.లక్షలు, రూ.కోట్లలో జరిగే నిర్మాణ పనులపైనే కాకుండా రూ.వేలల్లో జరిగే చిన్న పనులపై కూడా అధికారులు శ్రద్ధ చూపాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఈ.పుల్లారెడ్డి, మాజీ కార్పొరేటర్ ఎ.బాలరాజు తెలిపారు. బుధవారం పట్టణ పౌర సంక్షేమ సంఘం స్థానికులతో కలిసి పాత బస్టాండ్, అర్బన్ బ్యాంక్, వడ్డగేరి ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వర్షం నీటిలో గుంతలు కనిపించక కొందరు, పని ముగించుకొని రాత్రిపూట ఇంటికి పోయే సమయంలో ద్విచక్ర వాహనదారులు రోడ్డు మ్యాన్ హోల్స్‌లో పడి అనేకమంది గాయాల పాలవుతున్నారని తెలిపారు. రూ.లక్షలు, కోట్ల రూపాయలతో నిర్మాణ పనులు చేస్తున్నారని చెప్పారు. రోడ్లపై రోడ్లు వేస్తూ రూ.వేలల్లో చేయగలిగిన చిన్న, చిన్న పనులపై నగరపాలక సంస్థ అధికారులు శ్రద్ధ పెట్టడం లేదని విమర్శించారు. భారీ వర్షాలు పడినప్పుడు వర్షం నీరు మురుగునీరు కలిసి రోడ్లపై ప్రవహిస్తున్న సందర్భంలో పనులు ముగించుకొని ఇంటికి పోయే రాత్రి సమయాల్లో మ్యాన్ హోల్స్‌పై ఇనుప మూతలు లేనందువల్ల ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. పాత బస్టాండ్‌లో సిమెంట్ రోడ్డుపై తారు రోడ్డు వేసిన నగరపాలక సంస్థ ఇంజినీర్లకు సమీపంలోని చిన్న, చిన్న సమస్యలు కనిపించలేదా అని ప్రశ్నించారు. నగరపాలక సంస్థ అధికారులు పన్నులు పెంచడంపై చూపిస్తున్న శ్రద్ధ ప్రజల సమస్యల పరిష్కారంపై చూపించడం లేదని విమర్శించారు. ఇన్‌ఛార్జి కమిషనర్ జోక్యం చేసుకొని మ్యాన్ హోల్స్‌పై ఇనుప మూతలు (మోరీలపై గుంతలు) బిగించడంతోపాటు మురుగు కాలువలను శుభ్రం చేయించాలని కోరారు. పిపిఎస్ఎస్ నగర నాయకులు ఎస్.రమణ గౌడ్, సివి.వర్మ, జె.నాగరాజు, ఎస్.మక్బుల్, జి.శంకర్, మున్నా, షకుర్, షాకీర్, నరేంద్ర పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న నాయకులు

వేదవతి ప్రాజెక్టును 'పిఎంకెసివై' లోకి చేర్చాలి

కేంద్రజలశక్తి మంత్రికి ఎంపి నాగరాజు వినతి

ప్రజాశక్తి కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లాలోని వేదవతి ప్రాజెక్టును ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన పథకం కింద చేర్చాలని కేంద్ర జలశక్తి మంత్రి చంద్రకాంత్ రఘునాథ్ పాటిల్‌ను కలసి కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు కోరారు. ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో కలిసి కేంద్ర మంత్రికి వినతిపత్రం సమర్పించారు. వేదవతి ప్రాజెక్టును పిఎంకెఎస్ వై పథకం కింద చేర్చితే ప్రాజెక్టు వేగవంతం అవుతుందని ఎంపి కోరారు. దీంతో సకాలంలో పూర్తయ్యేలా చూసుకోవచ్చని మంత్రి పాటిల్‌కు వివరించారు.. ఈ ప్రాజెక్టు ద్వారా 80వేల ఎకరాలకు నీరు అందించవచ్చని, దీంతో అధిక సంఖ్యలో రైతులకు లబ్ధి చేకూరి వలసలను అరికట్టవచ్చన్నారు. దీంతో పాటు కర్నూలు నియోజకవర్గానికి నీరు అందించడంలో వేదవతి ప్రాజెక్టు కీలకంగా మారుతుందని కేంద్రమంత్రికి తెలిపారు..



కర్నూల్ టు చెన్నై ఇంద్ర ఎసి బస్సు

ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్: కర్నూలు టు డిపో నుండి కర్నూలు టు చెన్నై ఇంద్ర ఏసి బస్సు నడుపుతున్నట్లు మేనేజర్ బి. సర్దార్ హుస్సేన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సర్వీసు నంద్యాల,ఆళ్లగడ్డ,మైదుకూరు, కడప తిరుపతి మీదుగా చెన్నైకి నడుపుతున్నట్లు తెలిపారు. కర్నూలు నుండి చెన్నై రాత్రి 8 గంటలకు గురు, ఆదివారాలలో, చెన్నై టు కర్నూలు రాత్రి 8 గంటలకు శుక్రవారం, సోమవారాల్లో నడపబడునని తెలిపారు. ప్రయాణికులు తమ దగ్గరలోని ఎటిబి ఏజెంట్ల వద్ద ,ఆర్టీసీ బస్ స్టేషన్‌లో, వెబ్సైట్ ద్వారా టికెట్లు బుక్ చేసుకోవాలని ఆయన తెలిపారు.



టమోటా లారీ బోల్తా

ప్రజాశక్తి వెల్దుర్తి

వెల్దుర్తి 44వ జాతీయ రహదారిలో హనుమాన్ జంక్షన్ దగ్గర మదనపల్లి నుండి అదిలాబాదుకు వెళుతున్న టమోటోలారీ తెల్లవారుజామున మూడు గంటల సమయంలో బోల్తా పడింది. డ్రైవర్ రహదారిలోని స్పీడ్ బ్రేకర్ ను గమనించకపోవడంతో అదుపుతప్పి బోల్తాపడింది. డ్రైవర్‌కు క్లీనర్‌కు ఎటువంటి గాయాలు కాలేదు. బోల్తా పడిన లారీని క్రేన్ సాయంతో పైకిలేపి లారీలోని లోడుని వేరే లారీలోకి ఎత్తించారు. వెల్దుర్తి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలలపై పెత్తనం!

ఎస్ఎంసి ఎన్నికల వేడి -అధికార పార్టీ నేత కను సన్నల్లోనే 1437 పాఠశాలల్లో నేడు ఎన్నికలు

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన, ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ఇప్పటికే అన్ని వ్యవస్థలపై తమ ముద్ర ఉండేలా చర్యలు చేపట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా కూటమి ప్రభుత్వం ముద్ర ఉండేలా ఎస్ఎంసి కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లు తమ అనుకూలమైన వారిని నియమించుకునేందుకు వ్యూహరచన చేసింది. అధికార పార్టీకి చెందిన వారిని ఈ పోస్టుల్లో ఉండేలా చర్యలు తీసుకుంటుంది. గ్రామాల్లో పాఠశాలల్లో ఎస్ఎంసి ఎన్నికల వేడి గత వారం రోజులుగా కొనసాగుతుంది. కర్నూలు జిల్లాలోని 1437 పాఠశాలలకు పాఠశాల యాజమాన్య కమిటీలను గురువారం ఎన్నుకోనున్నారు. ఈనెల 1వ తేదీన జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ , జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ఎంసి కమిటీ ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ కమిటీలో సభ్యులుగా ఉండేవారు సంబంధిత పాఠశాలలో చదివే విద్యార్థుల తల్లిదండ్రులు లేదా సంరక్షకులు ఉంటారు. ఆరుగురు సభ్యుల ఎన్నిక అనంతరం చైర్మన్ , వైస్ చైర్మన్‌లను ఎన్నుకుంటారు. ఈ కమిటీకి కన్వీనర్‌గా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వ్యవహరిస్తారు.

పాఠశాలలపై పెత్తనం కోసం ఇప్పటికే అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు గ్రామాల్లో తమ అనుచరులుగా ఉన్నటువంటి వారిని పాఠశాల కమిటీల్లోకి పెట్టి అక్కడ వారి పెత్తనం కొనసాగించేలా దృష్టి సారిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రధానమైనటువంటి చైర్మన్, వైస్ చైర్మన్ పోస్టులను తమ అనుచర వర్గాలకే కేటాయించేలా ఇప్పటికే పేర్లను సిఫార్సు చేసి సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు పంపారు. గతంలో జరిగిన ఎన్నికల్లో పలు పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులు ఘర్షణలకు దిగిన ఘటనలు కూడా అనేకం ఉన్నాయి. ఈసారి అలా కాకుండా పాఠశాల యాజమాన్య కమిటీలను ఏకగ్రీవం చేసుకునేందుకు ఇప్పటికే ప్రజాప్రతినిధులు రంగం సిద్ధం చేశారు. పోటీలోకి ఎవరు రాకుండా తమ అనుచరులని చైర్మన్, వైస్ చైర్మన్ పోస్టులలో పెట్టేందుకు సిద్ధమయ్యారు. ప్రధానంగా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుడు ,ఉపాధ్యాయులను తమ ఆధీనంలో ఉండేలా ప్రజాప్రతినిధులు ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. గ్రామస్థాయిలో నామినేటెడ్ పోస్ట్‌గా ఉండే ఎస్ఎంసి కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లను తమ అనుచర వర్గాలకే దక్కేల ప్రణాళికలను రూపొందించుకున్నారు.

పాఠశాల నిధుల పర్యవేక్షణ ఎస్ఎంసిలవే

పాఠశాలలకు విడుదల స్కూల్ గ్రాండ్స్ నిధుల పర్యవేక్షణ మొత్తం స్కూల్ యాజమాన్య కమిటీలే ప్రధాన పాత్ర పోషిస్తాయి. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం, టాయిలెట్స్ పర్యవేక్షణ వంటి అంశాలపై కూడా ఈ కమిటీనే పర్యవేక్షిస్తుంది. పాఠశాలలకు విడుదలయ్యే నిధుల ఖర్చు వంటి వాటికి సంబంధించి కూడా పర్యవేక్షణ బాధ్యత ఎస్ఎంసిలదే ఉంటుంది. అందుకే ఈ కమిటీ ఎన్నికలను ప్రాధాన్యతగా తీసుకొని అధికార పార్టీ నేతలు తమ అనుచర వర్గాల్లోనే కూర్చోబెట్టేలా రంగం సిద్ధం చేశారు.

ఎస్ఎంసి ఎన్నికలు పకడ్బందీగా నిర్వహణ

జిల్లా విద్యాశాఖ అధికారి కె. శామ్యూల్ , ఇన్చార్జి ఏపీసి ఎస్ఎస్ఎం

జిల్లాలో ప్రశాంత వాతావరణంలో స్కూల్ యాజమాన్య కమిటీ ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ కమిటీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేలా దృష్టిపెట్టాం. ఎక్కడ ఎలాంటి చేసుకోకుండా ఎస్ఎంసి కమిటీ ఎన్నికలు నిర్వహించాలని మండల విద్యాశాఖ అధికారులు పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు ఇచ్చాం.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

కెవిఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కెవి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

విద్యార్థులు తమ శిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కెవిఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కెవి సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం డాక్టర్ కెవి సుబ్బారెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన లయన్ డాక్టర్ కెవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమ శిక్షణతో ఉండాలని, 100 శాతం అటెండెన్స్ కల్గి ఉండాలన్నారు. కష్టపడి చదవాలని మీ తల్లిదండ్రులకు కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని నూతన విద్యార్థులకు సూచించారు. ర్యాగింగ్ లేని కళాశాల అది కేవలం మన కళాశాల అని అన్నారు. కళాశాల కరెస్పాండెంట్ ఎస్.విజయ లక్ష్మమ్మ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టపడితే కానీ విజయం చేరుకోలేమని, ఈ పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ కష్టపడి కాలాన్ని వృథా చేసుకోకుండా చదవాలని పేర్కొన్నారు. డెల్లోట్ కంపెనీ హెచ్ఆర్ కె లహరి, కళాశాల ప్రిన్సిపల్ జె. కన్నా కుమార్ ,వైస్ ప్రిన్సిపల్ తిరుపతి రెడ్డి, నాక్ కోఆర్డినేటర్ డాక్టర్ సి.ధనరాజ్, ప్రొఫెసర్స్, ఫ్యాకల్టీ ,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ కెవి సుబ్బారెడ్డి



త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫైళ్లను పరిశీలిస్తున్న ఎస్‌పి బిందుమాధవ్

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

త్రీ టౌన్ పోలీసు స్టేషన్ తనిఖీలో ఎస్‌పి బిందుమాధవ్
రౌడీషీట్స్, సస్పెక్ట్ షీట్స్ ను పరిశీలించి సూచనలు

ప్రజాశక్తి కర్నూలు క్రైమ్ : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపాలని కర్నూలు ఎస్‌పి జి.బిందుమాధవ్ ఆదేశించారు. కర్నూలు మూడవ పోలీసు స్టేషన్‌ను జిల్లా ఎస్‌పి జి. బిందు మాధవ్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బందితో మాట్లాడి వారి విధులకు సంబంధించిన సూచనలు చేశారు. సిబ్బందిని సమావేశ పరిచి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సిఐకి, ఎస్ఐలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీ షీట్స్, సస్పెక్ట్‌షీట్స్ , వార్డు హిస్టరీ షీట్స్‌ను పరిశీలించారు. ఎప్పటికప్పుడు వారి ఫోటోలను అప్ డేట్ చేయాలన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. సైబర్ నేరాల నివారణకు అవగాహనకు సదస్సులు నిర్వహించాలన్నారు. పునరావృత నేరస్తులపై నిఘా ఉంచాలన్నారు. రికార్డులు, రిసెప్షన్ , లాకప్, జనరల్ డైరీ, సిబ్బంది వివరాలు, పోలీసుస్టేషన్ పరిసరాలను పరిశీలించారు. తగు సూచనలు చేశారు. అనుమానస్పద మిస్సింగ్ కేసులను త్వరగా చేధించాలన్నారు. కేసుల వివరాలు గురించి ఆరా తీశారు. సిబ్బందికి రోటేషన్ పద్ధతిన విధులు కేటాయించాలన్నారు. సమస్యల పట్ల బాధితులు పోలీసుస్టేషన్‌ను ఆశ్రయించినప్పుడు వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. నిరంతరం గస్తీ నిర్వహించాలని, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. జిల్లా ఎస్‌పి వెంట కర్నూలు మూడవ పట్టణ పోలీసు స్టేషన్ సిఐ మురళీధర్ రెడ్డి, ఎస్ఐ మన్మథవిజయ్ ఉన్నారు.

కోడుమూరులో చేనేత కార్మికుల ప్రదర్శన

ప్రజాశక్తి కోడుమూరు రూరల్ : జాతీయ చేనేత కార్మిక దినోత్సవం సందర్భంగా కోడుమూరు సిఐటియు ఆఫీస్ నుంచి చేనేత కార్మికులు ర్యాలీగా బయలుదేరి కోట్ల సర్కిల్ మీదుగా జాతిపిత గాంధీ విగ్రహం వద్దకు కార్మికులు చేరుకున్నారు. జాతిపితకు పూలమాల వేశారు. ఈ కార్యక్రమాన్ని కె లక్ష్మణ అధ్యక్షతన నిర్వహించారు. చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.రాజు మాట్లాడుతూ చేనేత కార్మికులకు మూడు సెంట్ల స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించాలన్నారు. ముడి సరుకుల మీద జిఎస్‌టిని ఎత్తేయాలని, షెడ్డులో మగ్గాలునేసే కార్మికులు గుర్తించి అందరికీ గత ప్రభుత్వం నేతన్న నేస్తం ఇచ్చిందని, ఈ ప్రభుత్వం కూడా చేనేత కార్మికులకు నేతన్న నేస్తం రూ.40 వేలకు పెంచి అర్హులైన అందరికీ ఇవ్వాలని వారన్నారు.

బాధితులకు నష్టం కలుగకుండా చూస్తాం

- ఎమ్మెల్యే పార్థసారథి

ప్రజాశక్తి - ఆదోని



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్, ఎమ్మెల్యే

ఆదోని బైపాస్ బాధితులకు నష్టం కలుగకుండా చూసుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి తెలిపారు. బుధవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో అధికారులు, పట్టణ ప్రముఖులు, బాధితులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... బాధితుల సమస్యలను విని ఓదార్చి కష్టాలను తీర్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. మరోవైపు ఆదోని అభివృద్ధి కోసం బైపాస్ నిర్మాణం కూడా అవసరమన్నారు. పరిహారం పెంచే ప్రతిపాదనపై ఎక్కువ శాతం బాధితులు సముఖత చూపారని తెలిపారు. ఉన్నతాధికారులు, మంత్రులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సమన్వయం చేసుకొని బైపాస్ సమస్య పరిష్కార దిశగా కృషి చేస్తామని చెప్పారు. ఏ ఒక్క బాధితునికీ నష్టం కలుగకుండా చూసుకుంటానని హామీ ఇచ్చారు. సమస్య కొలిక్కి వస్తుందన్న నమ్మకంతో ముందుకు సాగుతానన్నారు. ఆదోని అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు.

బైపాస్ బాధితులందరికీ పరిహారం అందిస్తాం

- సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ

జాతీయ రహదారి కోసం భూములిచ్చిన ప్రతి ఒక్కరికీ పరిహారం అందజేస్తామని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ తెలిపారు. సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణంలో నేషనల్ హైవే బాధితులతో ఎమ్మెల్యే పార్థసారథితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... జాతీయ రహదారి కోసం 830 మంది నుంచి 23.6369 హెక్టార్ల భూమి సేకరించామని తెలిపారు. జాతీయ రహదారి కోసం భూములిచ్చిన వారు చరిత్రలో నిలిచిపోతారని ఎమ్మెల్యే తెలిపారు. నేషనల్ హైవే ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శంకర్ రెడ్డి, తహశీల్దార్ ఆర్.శివ రాముడు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జీ నియామకంపై నీలి నీడలు

- వీరభద్ర గౌడ్ వద్దని అధిష్టానంపై ఒత్తిడి పెంచుతున్న అసమ్మతి నేతలు

- అయోమయంలో టిడిపి కేడర్

ప్రజాశక్తి-ఆలూరు

టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీగా వీరభద్రగౌడ్ నియామకంపై నీలి నీడలు కమ్ముకున్నాయి. వీరభద్రగౌడ్‌ను ఇన్‌ఛార్జీగా నియమించవద్దని అసమ్మతి నేతలు అధిష్టానంపై ఒత్తిడి పెంచుతున్నారు. మంగళవారం టిడిపి ఆలూరు నియోజకవర్గ ముఖ్య నేతలు యువనేత నారా లోకేష్‌ను కలిశారు. వీరభద్ర గౌడ్ ఓటమి, ఆయన పని తీరుపై రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. వీరభద్ర గౌడ్‌ను ఇన్‌ఛార్జీగా నియమించవద్దని కోరినట్లు తెలిసింది. అధిష్టానం కూడా ఆలూరు పంచాయితీని త్వరలో తేలుస్తామని స్పష్టం చేసినట్లు సమాచారం. అధిష్టానం చెప్పిన మాటల మేరకు ఇన్‌ఛార్జీ మార్పుపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. గత రెండు నెలలుగా టిడిపి ఇన్‌ఛార్జీ నియామకంపై పంచాయితీ కొనసాగుతోంది. వీరభద్ర గౌడ్‌ను తప్పించాలని అసమ్మతి నేతలు ఇప్పటికే రెండుసార్లు అధిష్టానాన్ని కలిశారు. వీరభద్ర గౌడ్ అదే స్థాయిలో అధిష్టానాన్ని కలుస్తూ తన నియమకానికి ఎలాంటి ఢోకా లేదనే విధంగా వ్యవహరిస్తున్నారు.

వీరభద్ర గౌడ్ నియామకంపై సీనియర్లలో అసంతృప్తి

వీరభద్ర గౌడ్‌ను నియమించవద్దని సీనియర్ నాయకుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఉన్నట్లు తెలిసింది. ఆయన గెలుపు కోసం పని చేసిన తమపైనే అధిష్టానానికి ఫిర్యాదు చేశారని సీనియర్లు మండిపడుతున్నారు. ఎన్నికల సమయంలో గెలుపుపై చర్చించేందుకు వెళితే తమతో మాట్లాడేందుకు వీరభద్ర గౌడ్ ఇష్టపడలేదని కొంత మంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2019 ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి జయరామ్ 40 వేల మెజార్టీతో గెలిచారని, గత ఎన్నికల్లో తామంతా కష్టపడి పని చేసినందుకే 2,851 మెజార్టీ వరకు తగ్గిందని పేర్కొంటున్నారు. వీరభద్ర గౌడ్ అందరినీ కలుపుకొని పోయి ఉంటే గెలుపు నల్లేరుపై నడకగా ఉండేదని చెబుతున్నారు. ఓటమి పాలైన తర్వాత మండల కన్వీనర్లు, క్లస్టర్లను దూరం పెడుతూ 'కరడుగట్టిన టిడిపి నాయకులైనా, కార్యకర్తలైనా నా దగ్గరకొచ్చిన వాడే నా వాడు' అన్నట్లు వినికిడి. మండలంలో ఒక గ్రామంలో ఎన్నికల ప్రచారంలో టిడిపి కార్యకర్తల ఇంటికి వెళ్లి వైసిపికి చెందిన వారు విచక్షణ రహితంగా దాడి చేస్తే వారిని పరామర్శించడానికి వెళ్లలేదని, జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి ఆస్పత్రికి వెళ్లి పరామర్శించి వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని తెలిపి బాధితులకు ధైర్యం చెప్పినట్లు తెలిపారు. అదే గ్రామ పంచాయతీలో టిడిపి ముఖ్యనేతకు తెలియకుండా ఆ గ్రామానికి సంబంధించిన డీలర్ షాప్‌ను దాడి చేసిన వారికి ఇస్తామనడంతో ఆ నేత వీరభద్ర గౌడ్ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.



యువనేత నారా లోకేష్‌కు వినతి అందజేస్తున్న అసమ్మతి నేతలు

అయోమయంలో టిడిపి కేడర్

రెండు నెలలుగా టిడిపి ఇన్‌ఛార్జీ మార్పుపై జరుగుతున్న ఊహాగానంతో కేడర్ అయోమయంలో పడింది. నియోజకవర్గంలో ఇప్పటికీ టిడిపిలో మూడు గ్రూపులుగా కొనసాగుతున్నాయి. గతంలో గ్రూపు పోరు వల్లే 30 ఏళ్ళ ఆలూరులో టిడిపి గెలవలేకపోయింది. ఇన్‌ఛార్జీ మార్పుపై జరుగుతున్న ఊహాగానాల వల్ల ప్రభుత్వాధికారులు తమ మాట వినడం లేదని టిడిపి కేడర్ ఆందోళన వ్యక్తం చేస్తోంది.

ఇన్‌ఛార్జీ పదవికి ఆశావాహులు

టిడిపి ఇన్‌ఛార్జీ పదవిని పొందేందుకు ఆశావాహులు పోటీ పడుతున్నారు. అసమ్మతి నేతలు మాత్రం వీరభద్ర గౌడ్‌కు కాకుండా ఎవరికి ఇచ్చినా అభ్యంతరం లేదని చెప్పినట్లు సమాచారం. ప్రస్తుతం వీరభద్ర గౌడ్‌తో పాటు అసమ్మతి నేతల్లో కొందరు టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ వైకుంఠం శివప్రసాద్ దంపతులు, మాజీ మంత్రి గుమ్మనూరు కుటుంబం, మాజీ జడ్‌పిటిసి ఏరూరు మీనాక్షి నాయుడు, జొహరాపురం వెంకటేష్ చౌదరి, మనేకుర్తి కురువ రాజశేఖర్ ఆశిస్తున్నట్లు తెలిసింది.

తగాదా సృష్టించేది వైసిపి నాయకులే

- నిజాలు తెలుసుకుని మాట్లాడాలి - బుట్టా రేణుకకు ఎమ్మెల్యే బీవీ హెచ్చరిక

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

మండలంలోని గ్రామాల్లో ప్రశాంతంగా జీవిస్తున్న రైతులు, అన్నదమ్ముల మధ్య భూతగాదాలు సృష్టించేది వైసిపి నాయకులేనని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భూ తగాదాలు పెట్టి శాంతిభద్రతలకు భంగం కలిగించి, తమపై బురద చల్లడం లాంటివి చేయడం సిగ్గుచేటని విమర్శించారు. నిజాలు తెలుసుకుని మాట్లాడాలని మాజీ ఎంపీ బుట్టా రేణుక సూచించారు. పరమాన్‌దొడ్డిలో జరిగిన సంఘటన మాసుమాన్‌దొడ్డిలో జరిగినట్లు చెబితే ఎలా అని ప్రశ్నించారు. బనవాసి గ్రామానికి చెందిన వైసిపి నాయకులే గత ప్రభుత్వంలో మేకల రంగస్వామిపై మేకల పెద్దయ్యతో దాడి చేయించారని తెలిపారు. చట్టపరమైన చర్యలు తీసుకోకుండా బసిరెడ్డి అడ్డుపడ్డారని చెప్పారు. ఇటీవల పరమాన్‌దొడ్డికి చెందిన రైతు గుడిసి నరసప్పను బనవాసి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు బసి రెడ్డి ఇంటికి పిలిపించి న్యాయం చేస్తానని చెప్పి అక్కడ పొలంలో గొడవ సృష్టించారని తెలిపారు. టిడిపి మండల అధ్యక్షులు పార్లపల్లి మల్లికార్జున, అడ్వకేట్ రషీద్, బనవాసి అయ్యలప్ప, బనవాసి ధనుంజయ, అబ్రహాం, మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఎస్ఎంసి ఎన్నికలకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి - చిప్పగిరి



గోనెగండ్ల ఎంఇఒ

ప్రభుత్వ ఆదేశాలతో గురువారం జరుగుబోతున్న స్కూలు మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈఓ సావిత్రమ్మ తెలిపారు. బుధవారం చిప్పగిరిలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మండలంలో మొత్తం 26 ప్రభుత్వ పాఠశాలలో ఎన్నికలు జరుగుతాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు మొత్తం 3184 మంది ఉన్నారన్నారు. ఉదయం ఏడు నుంచి మొదలు అవుతాయని, ఓటింగ్ ఒంటి గంటకు పూర్తి చేస్తామన్నారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు విద్యార్థుల తల్లిదండ్రులు అందరూ కూడా ప్రశాంతంగా జరగడానికి సహకారం అందించి విజయవంతం చేయాలని కోరారు.

గోనెగండ్ల : గోనెగండ్ల మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల ఎన్నికలకు ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఎంఈఓ -1 రామాంజనేయులు, ఎంఈఓ - 2 నీలకంఠ తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి ఎన్నికల ప్రక్రియను ప్రారంభించి మధ్యాహ్నం ఒంటిగంటలోపు ఓటింగ్ పూర్తి చేస్తామని అన్నారు.మండలంలో మొత్తం 55 ప్రభుత్వ పాఠశాలలలో 10,691 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, నేడు నిర్వహించనున్న ఓటింగులో వీళ్ళందరూ పాల్గొని ఆయా పాఠశాలల నిర్వహణ కమిటీలను ఎన్నుకొనున్నట్లు ఆయన తెలిపారు.

సమస్యాత్మక గ్రామాలపై వినతి

గత అనుభవాల దృష్ట్యా మండలంలోని అల్వాల, చిన్నమరివీడు, పెద్దమరివీడు, పెద్దనెలటూరు, వేముగోడు సమస్యాత్మక గ్రామాల పాఠశాలల్లో బందోబస్తుతో పాటు ఎన్నికల నిర్వహణకు తగిన చర్యలు తీసుకోవాలని మండల తహసిల్దారు, ఎంపీడీవోతో పాటు సిఐని కోరినట్లు వారు తెలిపారు.

చేనేతల పథకాలను అమలు చేయాలి

- ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

చేనేతల అభివృద్ధి కోసం సంక్షేమ పథకాలను అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం పట్టణ కార్యదర్శి భరణికాళప్ప డిమాండ్ చేశారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఎమ్మిగనూరు గాంధీ విగ్రహం వద్ద కార్యక్రమాన్ని నిర్వహించారు. మహాత్మా గాంధీ, చేనేత పితామహుడు మాచాని సోమప్ప విగ్రహాలకు పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా భరణికాళప్ప, నాయకులు లక్ష్మణ్, కృష్ణ, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు రాముడు మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో 1905 ఆగస్టు 7న కలకత్తాలో మొదలైన స్వదేశీ ఉద్యమంలో భాగంగా విదేశీ వస్త్ర బహిష్కరణ, స్వదేశీ వస్త్ర నినాదంలో పెద్ద ఎత్తున ఉద్యమం జరిగిందని, ఆరోజును గుర్తు చేసుకుంటూ జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. చేనేత వస్త్రాలపై ఐదు శాతం జీఎస్టీని తొలగించాలని డిమాండ్ చేశారు. నేటికి అనేకమందికి చేనేత గుర్తింపు కార్డులు మంజూరు చేయలేదని తెలియజేశారు. చేనేతలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తును అందించాలని కోరారు. 50 శాతం సబ్సిడీతో ప్రతి చేనేత కార్మికునికి రూ.రెండు లక్షల బ్యాంకు రుణాన్ని ఇవ్వాలని తెలిపారు. చేనేత నేస్తం పేరుతో గత ప్రభుత్వం రూ.24 వేలు మంజూరు చేసిందని, ఈ ప్రభుత్వం అదనంగా చేనేత కార్మిక నేస్తం కింద ఇవ్వాలని కోరారు. అనంతరం పద్మశ్రీమాచని సోమప్ప విగ్రహానికి పూలమాల సమర్పించారు. అనంతరం తేరు బజారులో జరిగినటువంటి చేనేత జాతీయ దినోత్సవ సందర్భంగా సమావేశాల్లో చేనేత కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కనికే లక్ష్మన్న, భరణి కాలప్ప ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డికి సమస్యలతో కూడుకున్న వినతి పత్రాన్ని సమర్పించారు. చేనేత సంఘం నాయకులు మాది గుండు రాజు, ఎల్లప్ప, మాదికొండ తిమ్మప్ప, మాచాని గోవిందు, కనకే వెంకటేశ్వర్లు, జి. శ్రీనివాసులు, సి.శ్రీనివాసులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహం ముందు నిరసన తెలియజేస్తున్న చేనేత కార్మికులు

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

- టిడిపి నాయకులు ఉల్లిగయ్య

ప్రజాశక్తి - కౌతాళం

మండల ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని టిడిపి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య, టిడిపి రాష్ట్ర యువత ఉపాధ్యక్షుడు సురేష్ నాయుడు, టిడిపి రైతు జిల్లా కార్యదర్శి వెంకటపతి రాజు కోరారు. బుధవారం తహశీల్దార్ మల్లికార్జున స్వామిని మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమం, విద్య, వైద్యం, రైతన్నలకు సేవ అందించాలని కోరుతూ రాజకీయ నాయకులకు, అధికారులకు స్నేహ పూర్వకమైన బంధంతో ముందుకు సాగాలని కోరారు. సీనియర్ నాయకులు రామలింగ, కురువ వీరేష్, రాజానందు, లక్కే గోవిందు, ముఖన్న, కాకం, జనసేన రామాంజినేయులు, చిరు, అమ్ము వలీ, మల్లయ్య పాల్గొన్నారు.

తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన మల్లికార్జున స్వామిని బిజెపి మండల ప్రధాన కార్యదర్శి నబీ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మండల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. బిజెపి నాయకులు కాశీం, ఖాదర్‌బాష పాల్గొన్నారు.



తహశీల్దార్‌ను సన్మానిస్తున్న నాయకులు

అన్న క్యాంటీన్ పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పునర్ ప్రారంభించనున్న అన్న క్యాంటీన్‌ల పనితీరును మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. బుధవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లోని, శివ, శ్రీనివాస టాకీస్ సర్కిల్‌లోని అన్న క్యాంటీన్ల పురోగతిని పరిశీలించారు. దాదాపు పూర్తయ్యాయని ఆయన తెలిపారు. అలాగే ప్రభుత్వాస్పత్రి రోడ్డులో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు మురుగు కాలువ చెత్త తొలగింపు పనులను పర్యవేక్షించారు. ఎఇ మధుసూదన్ పాల్గొన్నారు.



అన్న క్యాంటీన్ పనులను కమిషనర్ గంగిరెడ్డి

'తల్లిపాలతో వ్యాధి నిరోధక శక్తి'

ప్రజాశక్తి - మంత్రాలయం

పుట్టిన నాటి నుంచి 6 నెలల వరకు పిల్లలకు తల్లి పాలు ఇవ్వాలని, తల్లి పాలల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయని అంగన్వాడీ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి బాయి తెలిపారు. బుధవారం మండలంలోని రచ్చుమర్రిలోని అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహించిన తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా గర్భిణులకు బాలింతలకు అవగాహన కల్పించారు. అంగన్వాడీ టీచర్లు అంజినమ్మ, మీనాక్షి, భారతి, నాగవేణి, లావణ్యాదేవి పాల్గొన్నారు.

జగన్‌తోనే చేనేతల అభివృద్ధి

- వైసిపి ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక

- చేనేతపురిలో జాతీయ చేనేత దినోత్సవం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డితోనే చేనేతల అభివృద్ధి సాధ్యమని వైసిపి ఇన్‌ఛార్జీ, మాజీ ఎంపీ బుట్టా రేణుక తెలిపారు. బుధవారం జాతీయ చేనేతల దినోత్సవం సందర్భంగా వైసిపి కార్యాలయంలో పద్మశ్రీ మాచాని సోమప్ప చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా బుట్టా రేణుక మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నో చేనేత ప్రాంతాలున్నా ఎమ్మిగనూరుకు ఒక ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన ఘనత పద్మశ్రీ మాచాని సోమప్పకు దక్కుతుందని తెలిపారు. రాష్ట్రంలోనే పేరుగాంచిన ధర్మవరానికి ధీటుగా ఎమ్మిగనూరును అభివృద్ధి చేసి చేనేత పురిగా పేరు తీసుకొచ్చారని చెప్పారు. ఎమ్మిగనూరు కేంద్రంగా అనేక పరిశ్రమలు ఏర్పాటు చేసి వేల మందికి ఉపాధి కల్పించారని తెలిపారు. పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో మాచాని సోమప్ప కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. యువ నాయకులు బుట్టా ప్రతుల్, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ వై.రుద్ర గౌడ్, వైసిపి మండల కన్వీనర్ బిఆర్.బసిరెడ్డి, శాప్ నెట్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ మాచాని వెంకటేష్, మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ రఘు, వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్, ఎమ్మిగనూరు వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ మాజీ ఛైర్మన్ బండా నాగరాజు, టౌన్ బ్యాంకు మాజీ ఛైర్మన్లు బిఎన్.నాగరాజు, యుకె.రాజశేఖర్, కౌన్సిలర్లు నాగేశప్ప, నీలకంఠ, ఎంకె.శివప్రసాద్, అంపమ్మ, శివన్న, విశ్వనాథ, రమేష్, వెంకటాపురం బజారి, రుద్రాక్షల బజారి, పాల శ్రీనివాసరెడ్డి, యుకె.వీరేంద్ర, కోటకొండ నరసింహులు, మహబూబ్ బేగ్, డిష్ రఫీ, వడ్డే వీరేష్, శ్రీరాములు, చంద్రశేఖర్, గోరవయ్య, కిబ్రియ, ఫయాజ్, గోనెగండ్ల టీచర్ మునెప్ప పాల్గొన్నారు. **ఆదోని** పట్టణంలోని చేనేత కార్మికులను బిజెపి పట్టణ కోశాధికారి చిల్లాల దత్త ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బిజెపి పట్టణ అధ్యక్షులు జిందే సాయి కుమార్, నాయకులు వడ్డే శేఖర్, శ్రీనివాసులు, లక్ష్మణ్, రోష, కృష్ణ, కృష్ణారావు, ఈరన్న, గురునాథ్, మంజుల, లక్ష్మీబాయి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బుట్టా రేణుక



శ్రీమఠంలో కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామిని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి బుధవారం దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న వారికి శ్రీ మఠం పిఆర్వో కార్యాలయ సిబ్బంది బింధు మాధవాచార్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళ హారతులు స్వీకరించారు. అనంతరం పీఠాధిపతులు సుభుదేంద్రతీర్థులు వారికి శేష వస్త్రం ఫల మంత్రాక్షితలు అందజేసి ఆశీర్వదించారు. ఆయనకు ఎస్సై గోపినాథ్ సిబ్బందితో తగిన భద్రత కల్పించారు.

తహశీల్దార్ శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - నందవరం



నందవరం తహశీల్దార్‌గా కె.శ్రీనివాసులు బాధ్యతలు చేపట్టారు. బుధవారం ఇంచార్జ్ తహశీల్దార్ డిటి వాహిద్ నుండి బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2010 కి ముందు వరకు దేవనకొండ మండలంలో గ్రేడ్ 2 ఉపాధ్యాయుడిగా పని చేశానని, 2010 లో గ్రూపు 2లో ఉద్యోగం సాధించి విజయవాడలోని ఎపి సచివాలయంలో ఉద్యోగంలో చేరి, ప్రమోషన్ ద్వారా సెక్షన్ ఆఫసర్‌గా పని చేసి నందవరం మండలానికి తహసీల్దారుగా వచ్చానన్నారు. మండలంలోని రైతుల సమస్యలపై తక్షణమే స్పందిస్తానని, ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా పనిచేసేందుకు కృషి చేస్తానని అన్నారు. అనంతరం నూతన తహసీల్దార్‌కు కార్యాలయంలోని ఆర్ఐ జర్మీయా, సీనియర్ అసిస్టెంట్ జనార్దన్ రావు, వీఆర్వోలు, సర్వేయర్లు, కార్యాలయ సిబ్బంది పూలమాల, బొకేలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థినిది ఆత్మహత్య కాదు.. హత్య

- ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి షబ్బీర్

ప్రజాశక్తి - మంత్రాలయం

విద్యార్థిని పార్వతిది ఆత్మహత్య కాదని, హత్య అని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి షబ్బీర్ భాషా ఆరోపించారు. బుధవారం ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రచ్చుమర్రి ఏపీ మోడల్ స్కూల్ హాస్టల్‌లో మృతి చెందిన పదవ తరగతి విద్యార్థిని పార్వతి కుటుంబానికి తగిన న్యాయం చేయాలని కోరుతూ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి రాఘవేంద్ర కూడలి వరకు ర్యాలీ చేసి కూడలిలో ధర్నా చేపట్టి వాహనాల రాకపోకలను స్థంభింప చేశారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు జిల్లా సహాయ కార్యదర్శి థామస్ మాట్లాడుతూ పార్వతి అనే విద్యార్థిని మృతికి గల కారణాలు ఏమిటో ఇంతవరకు వెలుగులోకి రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్ క్యాంపస్‌లో అంత మంది విద్యార్థులు ఉన్నచోట పార్వతిది ఆత్మహత్య చేసుకుందని అంటున్నారని, ఈ ఘటననూ ఎవరు చూడలేదా అని ప్రశ్నించారు. పార్వతిది ఆత్మహత్య కాదు హత్య అని భావిస్తున్నామన్నారు. ఆ విద్యార్థిని ఫ్యాన్‌కి ఉరి వేసుకుని చనిపోతే రక్తపు మరకలు ఎక్కడి నుంచి వచ్చాయని, విద్యార్థి గొంతుకు కడ్డీతో కాల్చిన వాతలు ఎందుకు పడ్డాయని వారు ప్రశ్నించారు. అదేవిధంగా విద్యార్థి పోస్ట్ మార్టానికి తీసుకువెళ్లితే అక్కడ పోస్టుమార్టం చేసే సమయం అయిపోయిందని డాక్టర్ చెప్పినా కూడా రాత్రి 8 గంటలకు పోస్టుమార్టం చేయించడం వెనక గల కారణాలు ఏమున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ విద్యాశాఖ అధికారులు, పోలీస్ శాఖ అధికారులు స్పందించి విద్యార్థి ఆత్మహత్యకు గల కారణాలు వెలికి తీసి విద్యార్థి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విద్యార్థిని కుటుంబానికి రూ.20 లక్షల నష్ట పరిహారం అందించి వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ ఎస్ రవికి సమర్పించారు. ఎఐఎస్ఎఫ్ నాయకులు వీరేష్, దివాకర్, మైఖేల్, రఘు, వీరు, విద్యార్థులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న కష్ణ కుమార్

'ఇంటి నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి'

ప్రజాశక్తి - చిప్పగిరి

గత నాలుగు నెలల నుంచి ఇంటి నిర్మాణాలు నిలిపివేసిన లబ్ధిదారులందరూ కూడా త్వరగా పూర్తిచేయాలని లబ్ధిదారులకు హౌసింగ్ అధికారి కృష్ణ కుమార్ తెలిపారు. బుధవారం నగర డోనా గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన గృహ నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి వారితో మాట్లాడారు. మీరు ఎంత త్వరగా పూర్తిచేస్తే నిర్మాణ బిల్లులను అంత త్వరగా మంజూరు అవుతాయన్నారు. నిర్మాణాలు మధ్యలో నిలిపివేసిన వారందరూ కూడా ఆలస్యం చేయకుండా పూర్తి చేస్తే అంత తొందరగా బిల్లులు పెట్టే బాధ్యత తనపై ఉందన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి - ఆదోని



సమస్యను సిఐకి విన్నవిస్తున్న నాయకులు

వన్‌టౌన్ పరిధిలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి నాయుడు కోరారు. బుధవారం ఆదోని వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన సిఐ శ్రీరామ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అసాంఘిక కార్యకలాపాలను అణిచి వేయాలని కోరారు. డివిజన్ గౌరవ సలహాదారులు ఢణాపురం శేషన్న, తాలూకా గౌరవ సలహాదారులు బండారి రాజేశ్వరరావు, పట్టణ గౌరవ సలహాదారులు డాక్టర్ యు.సోమశేఖర్, ఎం.వీరభద్ర, బి.మల్లేశ్వరప్ప, నల్లారెడ్డి పాల్గొన్నారు.

'సమాజ హితం కోసం యువత నడుం బిగించాలి'

ప్రజాశక్తి - ఆదోని

మంచి వ్యవస్థ, సమాజ హితం కోసం యువత నడుం బిగించాలని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు, అధికార ప్రతినిధి బోయ తేజా కోరారు. బుధవారం ఆదోని వన్ టౌన్ పోలీసు స్టేషన్‌లో సిఐ శ్రీరామ్‌ను వారు మర్యాదపూర్వంగా కలిసి శాలువా, పూలమాలలతో సన్మానించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి దేశాభివృద్ధికి పాటు పడాలని, సాంకేతికను వినియోగించుకొని అన్ని రంగాల్లో రాణించాలని సిఐ సూచించారు. నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు బెస్త జయ సూర్య, బల్లేకల్లు సూర్య, మహేష్ నాయుడు, తెలుగు నాడు విద్యార్థి సమాఖ్య నాయకులు వికాస్, రఘు, సూరజ్, మహేష్, హేమంత్, మల్లికార్జున, రమేష్, ఉదయ్, అజయ్, రాజు పాల్గొన్నారు.



సిఐని కలిసిన నాయకులు

ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బందులు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. సహకరించాల్సిన అధికారులే నిర్లక్ష్యం వహించడం వల్ల సమస్య మరింత జఠిలమవుతోందని పలువురు వాపోతున్నారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎమ్మెల్యే పార్థసారథి, సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ ఆధ్వర్యంలో హైవే రోడ్డు బాధితులతో సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో పాల్గొనేందుకు వివిధ పార్టీలకు చెందిన నాయకులు, బాధితులు భారీ సంఖ్యలో వచ్చారు. వారందరూ తీసుకొచ్చిన వాహనాలతో ఆ ప్రాంతమంతా రద్దీగా మారింది. కోర్టు, తహశీల్దార్ కార్యాలయం, పోలీసు స్టేషన్, సబ్ జైలుకు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాహనం ఎదురుగా వస్తే సైడ్ ఇవ్వలేని పరిస్థితి దాపురించింది. ఇలాంటి సమావేశాలు ట్రాఫిక్ లేనిచోట నిర్వహిస్తే అందరికీ ప్రయోజనకరంగా ఉంటుందని సీనియర్ అడ్వకేట్ నాగేంద్రయ్య అభ్యంతరం వ్యక్తం చేశారు. తాను కారులో ఇంటికి వెళ్లాల్సి ఉందని, రోడ్డుకు అడ్డదిడ్డంగా రాజకీయ నాయకులు, అధికారుల వాహనాలు బైకులు నిలపడం వల్ల వేచిచూసి వెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు.



అభినందనలు తెలుపుతున్న టిడిపి నాయకులు

గోనెగండ్ల సిఐగా గంగాధర్

- ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తాం : సిఐ

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్ల అప్ గ్రేడ్ పోలీస్ స్టేషన్ సిఐగా ఏ గంగాధర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఏఎస్ఐలు తిమ్మారెడ్డి, వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలను అందజేస్తామని తెలిపారు. తాను గతంలో చిత్తూరు జిల్లా మదనపల్లెలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ సిఐగా పదోన్నతిపై కర్నూలు జిల్లాకు వచ్చి ప్రస్తుతం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గోనెగండ్ల సిఐగా బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు.

అభినందనలు తెలిపిన టిడిపి నాయకులు

బాధ్యతలు చేపట్టిన సిఐ గంగాధర్‌ను తెలుగుదేశం పార్టీ నాయకులు నజీర్ సాహెబ్ ఎన్‌వి.రామాంజనేయులు, బేతాళబడేసాబ్, తిరుపతయ్య నాయుడు, ఎస్ షేక్షావలి, ఫక్రుద్దీన్, మాజీ సర్పంచ్ రంగముని, మేకల మునెప్ప కలిసి శాలువాలు పూలమాలలతో అభినందనలు తెలిపి స్వాగతం పలికారు.

సెబ్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - కోసిగి

కోసిగి సెబ్ స్టేషన్‌ను అనంతపురం డిప్యూటీ కమిషనర్ టి. విజయ్ శేఖర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్లో ఉన్న పెండింగ్ కేసులను, వాహనాలను, ప్రాపర్టీ చెక్ చేసి కోసిగి సెబ్ సిబ్బందికి సూచనలు ఇచ్చారు. కర్ణాటక మద్యం రవాణాపై విచారించారు. కర్ణాటక అక్రమ మద్యం రవాణాకు అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. కోసిగి మండలం కర్ణాటక సరిహద్దు ప్రాంతం కావడంతో అక్రమ కర్ణాటక మద్యంపై నిఘా ఉంచి, సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కోసిగి సెబ్ సిఐ ఎస్.మహబూబ్ బాషా, ఎస్సై రమేష్ బాబు, నాగరాజు, మధు పాల్గొన్నారు.

రికార్డులను తనిఖీ చేస్తున్న విజయ్ శేఖర్

